Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

# సామాజిక బాధ్యత తెలిసిన శాస్త్రవేత్త

అఖిల భారత విద్యా హక్కు ఫోరం అధ్యక్ష వర్గ చైర్మన్, భౌతికశాస్త్రంలో లోతైన పరిశోధన చేసిన వాడు, శాస్త్రీయదృక్పథం విద్యలో కావాలని మనసారా ఆశించినవాడు, పేద ప్రజలవైపు నుండి సమాజాన్ని చూసినవాడు, వియత్నాం యుద్ధానికి వ్యతిరేకంగా పోరాడి అమెరికాలో జైలుపాలైన వాడు, కలకత్తాలోని ప్రఖ్యాత బోస్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్‌గా పనిచేసిన మెహర్ ఇంజనియర్ ఏప్రిల్ 24న మరణించారు. ఆయన మరణవార్త ఫోరం అఖిలభారత విద్యా హక్కు సభ్యులందరినీ తీవ్రమైన విషాదానికి గురిచేసింది.

మెహర్ వ్యక్తిగా చాలా తక్కువగా మాట్లాడేవాడు. తన గురించి ఏ సందర్భంలోను మాట్లాడేవాడు కాదు. అఖిలభారత ఫోరం సమావేశాలు జరిగినప్పుడు కొన్ని సందర్భాలలో మేమిద్దరం రెండు మూడు రోజులు ఒకే గదిలో ఉండేవాళ్ళం, చాలా విషయాల గురించి మాట్లాడుకునేవాళ్ళం. అలాగే సంస్థలో చాలా మంది సభ్యులు ఆయనతో గత ఎనిమిది, తొమ్మిది సంవత్సరాలుగా కలిసి పని చేస్తున్నా చాలా ఆశ్చర్యంగా ఎవ్వరికి కూడా ఆయన వ్యక్తిగత, వృత్తిపర జీవితాన్ని గురించి వివరాలు తెలియవు. ఒక దశాబ్ద కాలం కలిసి పని చేసినా ఎవ్వరికి వివరాలు తెలియకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. ఆయన మరణం తర్వాత కొన్ని వివరాలు క్రమ క్రమంగా బయటకు వస్తున్నాయి.

మెహర్ కలకత్తా విశ్వవిద్యాలయంలో 1960ల చివర భౌతిక శాస్త్రంలో ముఖ్యంగా రేడియో ఫిజిక్స్‌లో డాక్టరేట్ చేసి, ఇంగ్లండ్, అమెరికాలో రెండు దశాబ్దాల కాలం భిన్న సంస్థల్లో పని చేశారు. అమెరికాలో 1970లలో జరిగిన వియత్నాం యుద్ధ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని జైలు పాలయ్యాడు. అక్కడే స్థిరపడాలి అని పాశ్చాత్య మహిళనే సహచరిగా కోరుకున్నా రెండు దశాబ్దాల తర్వాత పాశ్చాత్య సమాజాల దృక్పథాలతో విబేధించి, తిరిగి భారత దేశం వచ్చి, మొదట పబ్లిక్ రంగ సంస్థ ఓ.ఎన్.జి.సి.లో చేరి, కలకత్తాలోని బోస్ ఇనిస్టిట్యూట్‌లో ప్రొఫెసర్‌గా చేరి ఆ సంస్థ డైరెక్టర్ బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ తర్వాత కలకత్తాలోనే స్థిరపడ్డాడు.

ఆయన స్నేహితుల ద్వారా బయటకి వస్తున్న కొన్ని సంఘటనలను వింటూ మెహర్‌లోని మానవీయ కోణాన్ని గమనించవచ్చు. కలకత్తా మురికివాడలలోని బాలబాలికలకు భౌతికశాస్త్రంలోని మెలికలు బోధించే వాడని, తనే కర్రతో కొన్ని పరికరాలు తయారు చేసి వాటిద్వారా వాళ్ళకర్థమయ్యేలా బోధించేవాడని తెలిసింది. పేద పిల్లలకు బళ్ళల్లో పాఠాలు సరిగా చెప్పరని, చెప్పినా భౌతిక శాస్త్రం లాంటి శాస్త్రాన్ని బోధించడం కష్టమని భావించి మెహర్ ఈ ప్రయోగాన్ని చేశారు. ఇవ్వాళ చాలా మంది పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులకు ఇది ఎంతో స్ఫూర్తిదాయకం కావాలి.

పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలంటే కామన్ స్కూల్ విద్యా విధానం తప్ప వేరే గత్యంతరం లేదని మెహర్ ప్రగాఢంగా విశ్వసించటం వల్లనే అఖిలభారత విద్యా హక్కు పోరాటంలో భాగం కావడమే కాక అగ్రస్థానంలో బాధ్యతలు తీసుకుని నాయకత్వాన్ని అందించాడు. రెండేళ్ళ క్రితం పాట్నాలో జరిగిన ర్యాలీలో మూడు, నాలుగు కిలోమీటర్లు ఆరోగ్యం బాగా లేకున్నా నడిచారు. మన సమాజంలోని పిల్లలందరికీ నాణ్యమైన, సమానమైన, ఉచిత విద్య, కామన్ స్కూల్ ద్వారా అందించాలనే ఆశయం మీద ఆయన రాజీ లేకుండా జీవితమంతా నిలబడ్డాడు, దానికొరకై తన వంతు పాత్రను నిర్వహించారు. మెహర్ శాస్త్రజ్ఞుడే కాదు శాస్త్రీయ దృక్పథంతో జీవించాడు. ముఖ్యంగా శాస్త్రజ్ఞులు మూఢ విశ్వాసాల్లో కూరుకుపోతున్న రోజుల్లో, అఖిల భారత సైన్స్ కాంగ్రెస్ కూడా మూఢ విశ్వాసాలను ప్రచారం చేస్తున్న రోజుల్లో సమాజానికి, జీవితానికి శాస్త్రీయ దృక్పథాన్ని అమలు పరచడం సాధారణ విషయం కాదు. ఈ దేశంలో చాలా మంది సైంటిస్టులకి సైన్స్ కేవలం వృత్తి మాత్రమే. ప్రవృత్తిలో ఏమాత్రం సైన్స్ ప్రభావం కనిపించదు. సైన్స్ ప్రకృతిని ఎలా చూడాలో చెప్పడమే కాక సాక్ష్యాధారాలు లేకుండా దేనిని నమ్మకూడదంటుంది. ప్రశ్నించడం సైన్సు పురోగతికి ప్రాణవాయువులాంటిది. అలాంటి జ్ఞానాన్ని పొందిన వాళ్ళకు, సమాజంలో చుట్టూ జరుగుతున్న సంఘటనల పట్ల కూడా శాస్త్రీయ దృక్పథం ఉండాలి కద. సమాజంలో జరిగే సంఘటనల వెనక ఉండే కార్యకారణ సంబంధాల గురించి ఒక ఉత్సుకత ఉండాలి కద. ఈ దేశంలో చాలా మంది ఇంజనీర్లు, డాక్టర్లు, శాస్త్రవేత్తలు పుకార్లను ఇలాగే నమ్మేస్తుంటారు. అందుకే వక్ర ప్రచారానికి ఇంత ప్రాచుర్యం వచ్చింది. మీడియా ఇవ్వాళ ఇంత మందిని అమాయకులుగా, మూర్ఖులుగా భావించి తమ ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నది. మీడియాలో చెప్పేది నిజమేనా అని లక్షలాది మంది ప్రశ్నిస్తే ఈ మీడియా అరుపులు, అర్థం లేని వాదనలకు ఒక అడ్డుకట్ట పడుతుంది. నిజానికి మెహర్ ఇంజనీయర్ మీడియా ప్రచారాన్ని తిరస్కరించే వాడు. ఫోన్ చేసి మరీ మీడియా పట్ల తనకుండే ఆగ్రహాన్ని వ్యక్తపరిచేవాడు. జీవితాన్ని శాస్త్రీయంగా చూసే ఒక శాస్త్రజ్ఞుడు (అలాంటి వాళ్ళ అవసరం చాలా ఉన్న కాలంలో) మన మధ్య లేకపోవడం ఒక పెద్ద లోటే. మెహర్ మనిషిగా చాలా ఎదిగినవాడు. మానవీయత ఆయన ప్రవర్తనలో, ఆలోచనలో చాలా సహజంగా ఉండేది. దానివల్లే ఇవ్వాళ విద్యాహక్కు ఫోరంలో ఆయనకు దగ్గరగా వెళ్ళని వాళ్ళు కూడా ఒక స్నేహితుడిని కోల్పోయామని ఇది తమకు వ్యక్తిగత నష్టమని అంటున్నారు. ఈ మానవీయతా దృక్పథం సంస్థ నడపడంలో చాలా పనికి వచ్చింది. ఆయన ఏ వ్యక్తిగత వివాదాలలో పడేవారు కాదు. అన్ని వివాదాలకు బయట ఉండేవాడు. అవసరముంటే తప్ప జోక్యం చేసుకునేవాడు కాదు. సభ నిర్వహిస్తున్నప్పుడు హద్దులు దాటితే అందరి మీద ఆగ్రహపడేవాడు. ఐతే ఆయన ఆగ్రహం చాలా ముచ్చటగా ఉండేది. అందరూ ఆయన ఆగ్రహానికి ఆనందంగా స్పందించేవారు. ఇది ఒక అరుదైన మానవ సంబంధం. కేవలం విద్యా ఉద్యమమే కాదు సమకాలీన సమాజంలో మన దేశంలో జరుగుతున్న చాలా ప్రజా ఉద్యమాలతో మెహర్‌కు సంబంధముంది. వేడెక్కుతున్న వాతావరణం గురించి చాలా మధనపడేవాడు. ఎన్విరాన్‌మెంట్ గురించి జరిగే అన్ని ఉద్యమాలలో ఆయన భాగస్వామ్యం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉంది. రైతుల ఆత్మహత్యల పట్ల నిరంతరంగా స్పందించి రైతాంగ ఉద్యమాలకు, అలాగే అవినీతి వ్యతిరేక ఉద్యమానికి తన మద్దతు అందించాడు. ఈ అన్ని అంశాల గురించి నిరంతరంగా అధ్యయనం చేయడమే కాక తాను చదివిన పుస్తకాలను, వ్యాసాలను, వార్తాపత్రికలలో ప్రచురించిన వివరాలను అప్పటికప్పుడు ఫోన్లు చేస్తూ మా అందరి దృష్టికి తీసుకువచ్చేవాడు. పేదరికాన్ని గురించి, పెరుగుతున్న అసమానతల గురించి చాలా వివరాలు సేకరించేవాడు. ఉద్యమాలే సామాజిక మార్పుకు చోదకశక్తులు అనేది మెహర్ పూర్తిగా నమ్మాడు. ఆయన మరణం తర్వాత భిన్న సామాజిక ఉద్యమాలు ఆయనకు నివాళి అర్పించడమే ఆయన ఈ అరుదైన విశ్వాసానికి నిదర్శనం.

## నివాళి



మెహర్ ఇంజనియర్

**చాలా ప్రజా ఉద్యమాలతో మెహర్ ఇంజనియర్‌కు సంబంధముంది. రైతుల ఆత్మహత్యల పట్ల నిరంతరంగా స్పందించి రైతాంగ ఉద్యమాలకు అలాగే అవినీతి వ్యతిరేక ఉద్యమానికి తన మద్దతు అందించాడు. ఒక మేధావి సమాజాన్ని ఎంత మానవీకరించగలడో అంతా తన శాయశక్తులా కృషి చేసిన మెహర్ అందరికీ స్ఫూర్తిదాతే.**

వ్యక్తిగతంగా నాకు మెహర్ మరణం పూడ్చలేని లోటు. వారానికి రెండు మూడుసార్లయినా ఫోన్ చేసేవాడు. ఏదో ఒక అంశాన్ని వివరించేవాడు. ఫలానా వ్యాసం చదవమని, ఫలానా చర్చను ఫాలో కమ్మని, ఏదైనా మంచి వార్త ఉంటే దాన్ని పూర్తిగా చదివి వినిపించే వాడు. తనకు హార్ట్ అటాక్ వచ్చే ఒకటి రెండు రోజుల ముందు, ఈ సంవత్సరం వాతావరణ శాస్త్రజ్ఞుల ప్రకారం వేడి ఐదు డిగ్రీలు పెరుగుతుందని ఈ వేసవి కాలంలో బయటి ప్రయాణాలు ఏవీ చేయకూడదని ఒక స్నేహపూరిత సలహా ఇచ్చారు. ఇలా ఇతరుల గురించి నిరంతరంగా ఆలోచించే మనుషులు ఎంతో కరువయ్యారు. తనవంతుగా సమాజాన్ని ఎంత మానవీకరించగలడో అంతా తన శాయశక్తులా కృషి చేసిన మెహర్ ఇంజినీయర్ అందరికీ స్ఫూర్తిదాతే.

■ ప్రొ. జి. హరగోపాల్

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org